క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



తెనాలి అర్బన్: శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని షిరిడీ సాయి మనఇల్లు మహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు ఆదివారం పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ.. 1994 ఆగస్టు 10న మంగళగిరిలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రంను శ్రీ వెంకటేశ్వ యోగి గురూజీ ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా పట్టణ, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉచితంగా యోగాను కూడా నేర్పుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్తమాసు నాగేంద్ర బాబు, రమాదేవి, జగదీశ్వరి పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

తెనాలి అర్బన్: యంగ్ జనరేషన్ టీమ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారి రంగమ్మకు వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన తోపుడు బండిని ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ సాధిక్ మాట్లాడుతూ.. రంగమ్మ 15 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుందన్నారు. ఆమె బతుకుదెరువుకు అవసరమైన బండిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పేదలకు పలుచోట్ల అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు నవీన్, శివ, ఆలపాటి సాయి పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



తెనాలి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. స్థానిక నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రంలో జరిగిన ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పర్యావరణం, స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, ఉద్యమంలోని వివిధ ఘట్టాల చిత్రీకరణను అంశాలుగా ఇచ్చారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు వెంకటకృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ పాల్గొన్నారు. విజేతలకు ఆగస్టు 15న రోటరీ కార్యాలయంలో బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



తెనాలి టౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవసేవా ఆలయంలో ఆదివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకులు అచ్యుత దాసాజీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల గర్భస్థ శిశువుకు శక్తివంతమైన భవిష్యత్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. కొన్ని అనుకూల వాఖ్యాలను ఉపయోగించి నాడీ సంబంధిత మార్గం ద్వారా గర్భస్థ శిశువుల్లో గొప్ప ఆలోచనలు కలిగించేలా చేయవచ్చునన్నారు. దీనిలో భాగంగానే గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు పాటుపడాలి

తెనాలి రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగలకుదురు రైలుపేట శ్రీ కోదండ రామాలయం వద్ద శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలు, పౌర్ణమి సామూహిక హారతులు, రక్షాబంధన్ కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి ఖండ్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ధర్మ రక్షా బంధనం కార్యక్రమం జరుపుతూ హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక హారతులు నిర్వహించారు. ప్రతి గ్రామంలో ధర్మరక్షాబంధన్ కార్యక్రమాలు ధార్మిక సమితి ఆధారంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్లు కె.నాగరాజు, డి.నాగరాజు, పద్మ పాల్గొన్నారు.

విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు

భట్టిప్రోలు: విశ్రాంతి దినమున పరిశుద్ధంగా దేవుని ఆరాధించాలని రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ తెలిపారు. ఆదివారం భట్టిప్రోలు ప్యారిష్ ఆంధ్ర సావార్తిక లూథరన్ సంఘం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పని చేసిన 7వ దినమున విశ్రమించనున్నట్లు పేర్కొన్నారు. ఆరాధనలో పాల్గొన్న విశ్వాసులకు ఆయన దేవుని వాక్యం ఉపదేశించారు.

వ్యాపారంగా మారిన వైద్య వృత్తి

- డాక్టర్ హరిప్రసాద్‌రావు శతజయంతి వేడుకల్లో మంత్రి మనోహర్
- ముగ్గురు జాతీయస్థాయి ర్యాంకర్లకు రూ.3 లక్షల బహూకరణ



రూ.3 లక్షల నగదు అందుకున్న విద్యార్థులతో మంత్రి మనోహర్, డాక్టర్ ఉమ, కుటుంబసభ్యులు

తెనాలి: ఒకనాడు సేవాభావంతో కొనసాగిన వైద్యవృత్తి నేడు వ్యాపారంగా మారిందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇలాంటి తరుణంలోనూ వైద్యరంగం లోని పెద్దలు పాటించిన నిజాయితీ, నిబద్ధతను ఆ తర్వాతి తరాల్లోని కొందరు ఆచరిస్తుండటం గొప్ప విషయమన్నారు. డాక్టర్ గోగినేని హరిప్రసాద్‌రావు పాటించిన విలువలను అనుసరిస్తున్న ఆయన వారసులు ఇందుకు నిదర్శనమన్నారు. పట్టణానికి చెందిన ప్రసిద్ధ పేదల వైద్యుడు డాక్టర్ గోగినేని హరిప్రసాద్‌రావు శతజయంతి వేడుకలను ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని శ్రీరాధాకృష్ణ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ హరిప్రసాద్‌రావు కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అధ్యక్షత వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో తెనాలికి ఖ్యాతిని తీసుకొచ్చిన ప్రముఖుల్లో వైద్యులూ ఉన్నారని గుర్తుచేశారు. డాక్టర్ హరిప్రసాద్‌రావు ఆ కోవకు చెందుతారని అన్నారు. ఆయన విలువలను పాటిస్తూ, ఆయన పేరుతో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు రూ.లక్షల ఉపకార వేతనాలను అందిస్తున్న కుటుంబసభ్యులను అభినందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ పట్టణంలో తొలి ఆప్తమాలజీ వైద్యుడైన హరిప్రసాద్‌రావు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమయ పాలనను తామంతా అలవరచుకున్నట్లు చెప్పారు. ఎంత తక్కువ ఖర్చుతో రోగికి వైద్యం చేయాలనేది డాక్టర్ హరిప్రసాద్‌రావు దగ్గరే నేర్చుకున్నానని డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి చెప్పారు. విద్యకు ప్రాధాన్యతనిచ్చిన తాత డాక్టర్ హరిప్రసాద్‌రావు స్మారకార్థం జాతీయస్థాయి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకర్ల ఉన్నత చదువులకు అయిదేళ్లుగా ఆర్థికసాయం చేస్తున్నట్టు డాక్టర్ గోగినేని సందీప్ చెప్పారు. ప్రస్తుత సంవత్సరానికి జాతీయస్థాయి ర్యాంకర్లు వడ్లమూడి లోకేష్, భరత్ చంద్, సాయిచక్రిలకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.3 లక్షలను, జ్ఞాపికలను మంత్రి మనోహర్ చేతులమీదుగా అందజేశారు. డాక్టర్ స్వాతి స్వాగతం పలికారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ రూపేష్ పర్యవేక్షించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, పట్టణంలోని పలువురు వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

సభ్యుల నమ్మకమే పెట్టుబడిగా పురోగమనం

- 24 ఏళ్లలో 11 బ్రాంచిలకు విస్తరించాం
- ఈ ఏడాది మొత్తం వ్యాపారం రూ.600 కోట్లు
- చైర్మన్ డీఎల్ కాంతారావు



లా విద్యార్థినికి లాప్‌టాప్ ప్రదానం చేస్తున్న చైర్మన్



మాయలఫకీరు నాటకంలో సన్నివేశం

తెనాలి: పట్టణంలోని కాకతీయ మ్యూచ్‌వల్లి ఎయిడెడ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు, ఖాతాదారుల నమ్మకమే పెట్టుబడిగా పురోగమిస్తోందని సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అన్నారు. కాకకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ 24వ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం 24 ఏళ్ల వ్యవధిలో 11 బ్రాంచిలను నిర్వహిస్తూ అందులో 6 సొంత భవనాలను సమకూర్చుకున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో చీరాలలో 12వ బ్రాంచిని ఆరంభించనున్నట్టు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. రూ.150 కోట్ల పెట్టుబడితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.215 కోట్ల రుణాలను ఇచ్చి, రూ.600 కోట్ల టర్నోవరును సాధించగలిగామని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ.. రెండేళ్లకో బ్రాంచి చొప్పున సొసైటీ విస్తరణ ప్రశంసనీయమన్నారు. సొసైటీ వైస్‌చైర్మన్ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ.. త్వరలో ఇంటర్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. తొలుత పరిపాలన నివేదికను డైరెక్టర్ డి.చక్రధర్ చౌదరి సమర్పించారు. ఆడిట్ రిపోర్టును జనరల్ మేనేజరు పి.రవీంద్ర, అంచనా బడ్జెట్‌పై సీఈవో కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి ప్రవేశపెట్టారు. ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ చదువుతున్న కె.జాహ్నవికి సొసైటీ తరఫున లాప్‌టాప్‌ను అందజేశారు. సొసైటీ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్య శాస్త్రి, ఏకే ఖలీల్, కఠారి వాసుదేవనాయుడు, పీఏ స్వార్ బ్రహ్మాచార్యులు, న్యాయసలహాదారు వెలినేని రాఘవయ్య, విశ్రాంత సహకార రిజిస్ట్రారు కృష్ణారెడ్డి మాట్లాడారు. సమావేశానికి ముందు పౌరాణిక పద్యనాటకం మాయలఫకీరులో 'మాయలఫకీరు–సంగు' సీనును ప్రదర్శించారు.

అధికారంపై వ్యామోహంతో అబద్ధపు హామీలు



పథకాలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొల్లిపర: కూటమి నేతలు ఎన్నికలప్పుడు అధికారంపై వ్యామోహంతో అబద్ధపు హామీలు ఇచ్చారని సర్పంచు పిల్లి రాధిక, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు నాలాది బుజ్జిబాబు విమర్శించారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాలతో పార్టీ మండల అధ్యక్షులు కళ్లం వెంకటప్పారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనను వివరించి ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో పోకూరి విజయ్, పిల్లి గంగాధర్, మండ్రు రాజు, బత్తుల రవికుమార్, ఉన్నవ నాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాహితీ రత్న ప్రజ్ఞాచారికి సత్కారం



సత్కారం కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు

తెనాలి టౌన్: ఆర్ట్ ఫౌండేషన్, త్రివర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి బుక్స్ ఫెస్టివల్ కాంప్లెక్స్ నందు జాతీయ కవితా ఉత్సవాలు నిర్వహించారు. శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొని స్వాతంత్య్ర అనే అంశంతో పద్యపఠనం చేశారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాచారిని ఫౌండేషన్ అధ్యక్షులు పి.హరికృష్ణ, దుశ్శాలువాతో సత్కరించి ప్రసంశా పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణ, బెల్లకొండ విజయలక్ష్మి, లహరి, మహేందర్, చిన్నదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తెనాలి టౌన్: విద్యార్థులు అంకిత భావంతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా రాణించాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నాజర్‌పేటలోని వేద పాఠశాల వద్ద బ్రాహ్మణ పేద విద్యార్థినీ విద్యార్థులకు వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకిత భావంతో చదివి జీవితంలో ఉన్నతంగా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త కాశీనాథుని సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆర్.సూర్యనారాయణమూర్తి, పలువురు సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కేబుల్ గుంతతో ప్రమాదం!



తెనాలి: ఎయిర్‌టెల్ సంస్థ తెనాలిలో కేబుల్ లైను కోసం తీసిన గుంతలను రోజుల తరబడి అలానే వదిలేస్తున్నారని.. మున్సిపాలిటీ అనుమతితో వివిధ ప్రదేశాల్లో తీసిన గుంతలను పూడ్చివేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు జి.శరత్‌చంద్ర తెలిపారు. ఆదివారం ఈ అంశాన్ని ఆయన మీడియా దృష్టికి తీసుకువచ్చారు. గాంధీచౌక్‌లో లోతైన గుంత తీసి వదిలేసిన ప్రదేశాన్ని చూసి ఆయన మాట్లాడారు. దాదాపు రెండు వారాలకు పైగా ఆ గుంతలను అలానే ఉంచారని.. ట్రాఫిక్ రద్దీ నెలకొని గుంత వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కనీసం అక్కడ హెచ్చరిక బోర్డు లేదా ప్రమాదకరమన్న సంకేతాన్నీ ఉంచకపోవటం మంచిది కాదన్నారు. సత్వరమే గుంతలను పూడ్చేందుకు మున్సిపాలిటీ తగిన చర్యలను చేపట్టాలన్నారు.

250వ రోజుకు చేరిన దీక్షలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏపీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 250వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, నాగేశ్వరరావు, బూరుగ అంకయ్య, వై.సాంబశివరావు, కార్మికులు సూర్య ప్రకాష్, నవనీతమ్మ, కాసిం, రమాదేవి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బ్రదర్ ఆనందన్న

తెనాలి టౌన్: పాస్టర్ల గౌరవ వేతనం నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్, ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రదర్ ఆనందన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఇస్లాంపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దైవసేవ మీద ఆధారపడి కుటుంబ జీవనం సాగిస్తున్న పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు ఇవ్వాలని కోరారు. గత కొన్ని నెలలుగా గౌరవ వేతనం నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి రెవరెండ్ టి.రమేష్‌బాబు, అడ్వయిజర్ కె.దానియేల్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రాజధాని పేరుతో లక్షల ఎకరాలు తీసుకోవడం దుర్మార్గం

42వ రోజు రిలే దీక్షలో ఏఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు



రిలే దీక్షలో ఏఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు

నిడుముక్కల(తాడికొండ): రాజధాని పేరుతో లక్షల ఎకరాల భూములు తీసుకోవడం దుర్మార్గమని ఏఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో విడత భూ సమీకరణకు తాము వ్యతిరేకమని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ ఆగడాలపై తమ పోరాటం అన్నారు. రాజధాని శంకుస్థాపనకు విచ్చేసిన ప్రధాని మోదీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. రాజధానిపై పార్లమెంటులో చట్టం చేసి ఈ ప్రాంత రైతులకు తగిన న్యాయం చేయాలన్నారు. భూ సమీకరణ చేయాలనుకుంటే ప్రతి రైతుకు రిటర్నబుల్ ప్లాట్లతో సంబంధం లేకుండా భూమి ఇచ్చిన వెంటనే రూ.కోటి అందజేయడంతో పాటు ప్రతి నెలా వారి కుటుంబాలను పోషించుకునేందుకు రూ.10 వేలు పింఛన్ రూపంలో అందించాలన్నారు. ఈ ప్రాంత వాసిగా రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కట్టుబడి తాను గత 42 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నానని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రభుత్వం రెండో విడత సమీకరణపై నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సి, డి బ్లాక్‌లలో బాలబాలికలకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తమకు నచ్చిన రంగాలను ఎంచుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, అమరావతి ఐకాన్ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అలహరి శివ సతీష్‌కుమార్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జెట్టి శ్రావణి, ట్రైనర్ చంద్ర ఓబులారెడ్డి, విజయ, క్షితిజ, మనోహర్ రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: గ్రామదేవతలకు శ్రావణమాసం మూడో ఆదివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్ చప్పుళ్ల మధ్య భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. భట్టిప్రోలు గ్రామదేవత శ్రీ దండిపార్వతి, శ్మశాన వాటికలో కొలువైన శ్రీ గుండిపార్వతి, పెదపులివర్రులోని శ్రీ గోగులమ్మ వార్లకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. అర్చకులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ఎస్‌ఐ రవీంద్రనాయక్



మంగళగిరి టౌన్: నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని రౌడీ షీటర్లను ఎస్‌ఐ రవీంద్ర నాయక్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ప్రతి రౌడీ షీటర్‌పై పోలీస్ నిఘా ఉంటుందని, ఘర్షణలు, పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసమైనా నేర సంస్కృతిని వదిలివేసి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు చూసుకోవాలని సూచించారు. రౌడీ హిస్టరీ ఉన్న వారికి సమాజంలో గౌరవ మర్యాదలు ఉండవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో పక్షవాతానికి అడ్డుకట్ట



మాట్లాడుతున్న డాక్టర్ నటరాజ

గుంటూరు మెడికల్: షుగర్‌ను, అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవడం ద్వారా ప్రమాదకర పక్షవాతాన్ని నిరోధించవచ్చని నటరాజ్ న్యూరో కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ పి. నటరాజ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించాయి. డాక్టర్ నటరాజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పి.నటరాజ మాట్లాడుతూ మధుమేహం, అధిక రక్తపోటు బాధితులు వాటిని అదుపులో ఉంచుకోక పోవడంతో పక్షవాతానికి గురవుతున్నారని తెలిపారు. మధుమేహం, అధిక బీపీ బాధితులు వైద్యుని పర్యవేక్షణలో అదుపులో ఉంచుకోవడం ద్వారా మెదడు, నరాల వ్యాధులను నియంత్రించవచ్చని చెప్పారు. ధూమ, మద్యపానం గుట్కా, పొగాకు నమలడం వంటి దుర్వసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కలిగించడం ద్వారా వివిధ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా స్పెషలిస్టులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. డాక్టర్ టి. సేవ కుమార్ మాట్లాడుతూ నేడు చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదని తెలిపారు. ముఖ్యంగా యువత అనారోగ్యం కుటుంబం, రాష్ట్ర, దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం మెదడు, నరాల వ్యాధుల బాధితులను డాక్టర్ పి. నటరాజ పరీక్షించి, వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మేకా రామారావు, టి.వి.సాయిరామ్ పాల్గొన్నారు.

● షాక్ కొడుతున్న స్తంభం



కరెంటు షాక్ కొడుతున్న ముగ్గు రోడ్డులోని ఇనుప స్తంభం

తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో ముగ్గురోడ్డు నుంచి తాడేపల్లి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో ముగ్గు రోడ్డు చర్చి వద్ద 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం విద్యుత్ సరఫరా అయ్యి షాక్ కొడుతోందని స్థానికులు చెబుతున్నారు. బాగా ఎండగా ఉన్న సమయంలో లైట్‌గా షాక్ కొడుతున్న కరెంటు స్తంభం, చిన్నపాటి చిరుజల్లు పడినా భారీగా కరెంటు ఉత్పత్తి అయి షాక్ కొడుతోందని, ఒక్కోసారి స్తంభం నుంచి నిప్పురవ్వలు కూడా పడుతున్నాయని, ఈ స్తంభం ఇళ్ల మధ్య ఉండటంతో ఈ ప్రాంతంలో చిన్నారులకు ఎప్పుడు షాక్ కొడుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఆ ఇనుప స్తంభాన్ని తీసివేసి సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– తాడేపల్లిరూరల్

వైభవంగా గంగానమ్మ తల్లి కొలుపులు



పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్ కోటేశ్వరరావు

తెనాలి టౌన్: శ్రావణ ఆదివారం సందర్భంగా స్థానిక రామలింగేశ్వపేట డిపో సెంటర్ వద్ద గల గంగానమ్మ తల్లి కొలుపులను వైభవంగా నిర్వహించారు. 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుంకర కొండలరావు, మామిడాల సురేష్, అప్పారావు, సుమన్, ఎం.ప్రభాకర్, జగదీష్, రవిశంకర్ పాల్గొన్నారు.